కథానిక

# శరణార్థిని

బూ. రం. రావు

"మొన్న ఒక పత్రికలో పడ్డ మీ ఫోటో చూసినతర్వాత నీకు పెళ్ళి అయిన సంగతి తెలిసింది. ఇన్నాళ్ళకు నీ ఆచోకీ తెలిసింది కనుక ఈ ఆఖరు వుత్తరం వ్రాసి యిహ నిన్ను మరచిపోతాను. అమూల్యరత్నమని అనుకున్న నీకు, నల్లసరపు గుండువలె కఠినమైన గుండె కూడా వున్నదని అనుకోలేను. ఇతరుల హృదయాలను కోసే నైశిత్యం నీ హృదయరత్నానికి వున్నదని అనుకో లేదు. రత్నాన్ని కాని, వజ్రాన్ని కాని హరించుకుంటే ప్రాణంపోయి జీవికి యిక, యిహసంబంధమైన బాధలేమీ వుండవంటారు. కాని నిన్ను నేను హరించుకోనూలేను భరించుకోజాలనూ లేను. 'రత్నం' అనగానే ఒకే భావం స్ఫురిస్తుంది. దాని నైసర్గిక గుణం యెప్పుడూ మారదు. కాని మరి నీవో ఇష్టం వచ్చినట్లల్లా మారుతూవుంటావు!

"ఓసారి గులాబిపువ్వువలె మృదువుగా, ఒకసారి గువ్వపిల్లవలె అందంగా, ఒకసారి శరదిందురేఖ వలె ప్రశాంతంగా, ఒకసారి విపంచీ స్వనంవలె మధురంగా, ఒకసారి హేమ మధుపాత్రవలె ఆకర్షణీయంగా, ఒకసారి మధుర స్వాప్నిక మనోజరాగిణి వలె చంచలంగా మారిపోతావు. మరొకసారి ప్రాణాలు తీయకండా దహించే ప్రళయాగ్ని వలె, రాత్రింబవళ్ళు యేడ్పించే దయ్యంవలె, నెత్తురుపీల్చే ఆజన్మ వ్యాధివలె, ముక్కలు ముక్కలుగా తెలియకండా కోసివేసే వింతరంపంవలె కనుపడుతావు! ఇన్నిరకాలుగా మారే అపూర్వశక్తి స్వరూపిణివి. ఇన్ని శక్తులనూ నామీదే ప్రయోగించావు. ధన్యమైంది నా జీవితం.

"మిణుగురుకన్నా చిన్నదై, గడచిపోయిన వయసు బూడిదకుప్పక్రింద, యెక్కడో మూలుగుతూ, మరో క్షణానికి ఆ పరమాణువు కూడా బూడిదై కూలిపోయే సమయంలో, త్రవ్వితీసి రాజవేసి, పెద్ద జ్వాలగా నా కోరికలను ప్రజ్వలింపజేశావు. ముసలితనంలో చితికి చివికి నశించి, నిశ్చింతగా నిద్రపోతూవున్న నన్ను, 'ప్రేమతప్ప తక్కిందంతా యీ ప్రపంచంలో మిథ్య' అనే మిధ్యావాదానికి దింపావు నా ఆధ్యాత్మిక చింతనంతా నీపై రేగిన కామపు చిచ్చులో భస్మంచేశావు. ఆనందం, ఆశ, భ్రమ, నిరాశ, నిశ్చింత, అనే అయిదు అవస్థల్లో చివరి దానిని గట్టిగా కౌగిలించుకుని కళ్లు మూసుకుంటూవుంటే, ఆ కౌగిలిని వదిలించి నీ కౌగిలిలోకి తీసుకుని మొదటి అవస్థ అయిన ఆనందంలోకి తెచ్చావు. ఆఅవస్థలో అట్లా వుంచడం కాదుగదా. మళ్ళీ నా చివరిఅవస్థ నిశ్చింతలోకి నన్ను వెళ్లనీయక, మూడవ అవస్థ అయిన భ్రమలోకి తెచ్చి వదలి పెట్టి పోయావు! నా చివరి అవస్థకు నేను యెన్నటికైనా తిరిగి చేరుకుంటానా? అథవా చేరుకున్నా ఈలోపల నేను యెంత పరితాపం, యెన్ని యమయాతనలు పడాలో - అది నాకు యెంత దుస్సహంగా వుంటుందో యోచించావా? ఎందుకు యోచిస్తావు? నీకెందుకూ నేనెలా చస్తే? నిజాన్ని అబద్ధం, అబద్ధాన్ని నిజంఅనుకునేట్టు భ్రమింపజేశావు. మళ్లీ ఈ భ్రమకూడా ఒక 'భ్రమే'నని తేల్చేశావు! నీపేరు భారతి కాదు. భ్రమరాంబ అంటే బావుంటుందేమో! ఎందుకు చెప్పా నన్నిలా వేధించడం? నేను నీకేమి అపకారం చేశాను? అవును చేశాను. మహాపకారం చెశానని యిప్పుడు అనుకుంటున్నాను. నా వాస్తవ జగత్తుపై నీ చిరునవ్వు ముసుగుల యవనిక దించి, ఊహానిర్మిత ప్రణయ రంగం అలంకరించి, రసడోలికల్లో వూపి, ఆ స్వప్నసీమనే వాస్తవ ప్రపంచంగా కనపడేలా చేశావు. నీవూ నేనూ కలిసి వున్నప్పుడే నిజమైన జీవితాన్ని చూస్తున్నాననిపించేది. ఇది మినహా యింకోరకంగా వుండడం జీవితం కాదనిపించింది. నీవూ నేనూ విడిపోనంత కాలం జీవితమెప్పుడూ భారం అని

పించదనుకున్నాను... ఇదంతా యెందువల్లః దీనికి రెండే కారణాలు వుండజాల్తాయి. ఒకటి అప్పుడు నన్ను నీవు నిజంగా ప్రేమించిఅయినా వుండాలి. కాని అదికారణం కాదనీ అట్లా జరగలేదనీ యిప్పుడు తేలిపోయింది. రెండవ కారణం: నీవు ముఖ్యంగా నాకు అలా ఆ కృత్రిమ వాతావరణాన్ని వాస్తవ స్థితివలె కన పడజేసే చతురతా అనుభవమూ అయినా సంపాదించి ఉండాలి. ఇదే కారణం. ఇంకోటి కాదు. ఈనీ ప్రతిభకు గర్విస్తాను. ఈగర్వాన్నీ యీ సంతోషాన్నీ యిన్ని రోజులూ యెవరికీ తెలుపకండా దాచుకున్నాను. నీలాంటి వ్యక్తి పరిచయం పొందగలిగినందుకు నాకు దొరికిన యీ ఒకే ఒక జన్మము బహుశః తరించిందను కున్నాను. అలాఅనుకునేట్టు చేశావు మరి! నీవే అంత తెలివిగలదానవనీ నేనే అంత మూర్ఖుడినై పోయాననీ బోధపడింది యిప్పుడు - అంటే నీ పరిచయ భాగ్యం వల్ల కలిగిన ఆ అపూర్వాను భూతిని యింకెవరో కూడా పొందు తున్నారని తెలిసిన యిప్పుడు అయినా, నీవు సంపాదించిన ఆ నేర్పు చాకచక్యంవల్ల కలిగిన నిర్వికల్పానందం మాత్రం యెప్పుడూ నాలో భద్రంగా అణగిమణగి నిద్రపోయి, నేను కోరినప్పుడల్లా మేలుకొని నన్ను ఆనందరస తరంగిణీ తరంగ శిఖరాల్లో పునీతుణ్ణిచేస్తే, ఈ తియ్యని భావగుచ్ఛాలే నాపాలిటి రసవత్కావ్యాలై యెప్పటికప్పుడు క్రొత్త ఆనందాన్ని ప్రసాదిస్తే, అంతకన్నా యెక్కువ నాకింకేమి కావాలి?...

"హృదయం యిచ్చి పుచ్చుకున్నావు. నవ్వి నవ్వించావు. ఏడ్చి యేడ్పించావు. ఒకొక్కసారి యేడ్చి నవ్వించావు; నవ్వి యేడ్పించావు! కాని యిప్పటి నాయేడ్పూ నీనవ్వూ మాత్రం భరించ లేను. ఎడారికన్నా యెండిన నాబ్రతుకులో దివ్యామృతధునులను పరుగెత్తించి, యిప్పుడు దారుణ విషదవాగ్ని కీలలపాలు చేశావు. ఒకే ఒక్క విషయం నీకు జ్ఞాపకంచేసి యీ పిచ్చి ఉత్తరాన్ని ముగిస్తాను...

"ఆ రాత్రి-ఆ మధురాతిమధురమైనరాత్రి-మా యింట్లో డాబామీద పడుకున్నాం జ్ఞాప కం వుందీ? ఉండకండా యెట్లావుంటుంది లే. నీనవ్వు వెన్నలపాలనే ఆహారంగా తీసుకోమని, ఊరినుంచి ఆరోజే అలసి ఆకలితోవచ్చిన నన్ను సరిగా భోజనమైనా చేయనియ్యలేదు జ్ఞాపకం వుందీ? విరగబడి నవ్విన నీనవ్వుకు నేనుకూడా నవ్వలేక అన్నం తినజాలక చేయి కడిగేసు కున్నాను. ఆ రాత్రి హోటలునుంచి నీవే అన్నం తెప్పించి, నేను తినలేకపోతే పార వేయించావు-మళ్లీ పాలు తాగిందాకా వదల లేదు. ఏమిటో ఆ లీలల అర్థం అనుకున్నాను. నేను ఉద్రేకంలో అనబోయిన మాటల్ని నా పెదవుల్లోనుంచి లాక్కొని నీవే అనేశావు నేను ఆక్షేపించననే ధైర్యంతో. నేను వదల దలిచినా నీవు వదలిపెట్టక, 'పుష్పంధయాన్ని తెల్లవారిందాకా వదులుతుందా సరోజం' అని కదూ అన్నావు! నా మెడకు నడుముకూ నీ తనూ వల్లికను అవలంబనంచేసి యెంతో అమాయి కంగా, నిద్రపోయినట్టు కళ్లు మూసుకున్నావు. నిజంగా నీకు నిద్రపట్టిన తర్వాతగూడా నీవు దూరం జరుగలేదని నీకేం తెలుసు? తెల్లవార్లూ మేలుకొని నీ మెలికల సౌందర్యాన్ని ఆస్వా దిస్తూ గంటలు లెక్కపెడుతూ వుండిన నాకు తెలుసుగాని! ఇట్లా యిప్పుడు బాధించాలనే అట్లా అప్పుడు చేశావా? ఆ బహుమానాలన్నీ యెందుకు? ఈ సంగతి మొదలే చెబితే ఆ బహుమానాలేవీ అక్కరలేకండానే, నేనే నాప్రాణాలను సైతం యిచ్చేవాడినే, ఇప్పుడు యివ్వనని కాదు. ఈ బాధతో బాటు ఈ బాధను పొడిగిస్తూ యిప్పుడీ ప్రాణాలు యింకా వుండడమే నా యీ దారుణ నరకానికి కారణ మయింది. నిన్ను తలచుకొంటే నీ కోసం నేను చేయజాలని పని యేదీ లేదనిపి స్తుంది. కాని ఈ బాధ మాత్రం లేకపోతేసరి.

"నీకోసం నిర్వేదిస్తూ గడుపుతున్న నిద్ర లేని రాత్రులకు, ఈ విచారాన్ని జీర్ణించుకో లేక, కళ్ల నీరురాక, మనసూ, మెదడూ తాపంతో, నిస్సహాయమైన కోపంతో రక్తాన్ని వుడికించి పోసుకున్నందుకు, జీవన జ్యోతు లెగిరిపోయిన కళ్లతో, వెన్నెల రాత్రులకూ మధ్యాహ్నపు వానలకూ శరీరమనే వర్తి చేతన అప్పగించి ఉసూరుమంటూ ఏడుస్తున్న యుగ లకు, 'పిచ్చి పట్టింది వీడికి' అని వెక్కిరిం

నవ్వే ప్రతిఫలమా? ఇంత ప్రాయశ్చిత్తానికీ ఈ వికట హాస్యమే ప్రతిఫలమా? ఈవిధంగా నీమీద చూపించిన ప్రేమ ఇంకెవరిమీద చూపినా జీవితాంతం వరకే గాక ఈ జీవితం తరువాత మరో జీవితం వుంటే ఆ జీవితం గూడా మధురంగా గడచిపోయేదేమో!

“కాని ‘ప్రేమ’ అంటే ఏమో తెలియని నాకు ‘దురదృష్టవశాత్తు’ అని యిప్పుడనుకుంటున్నాను. మొదలు నిన్నే ప్రేమించే ఖర్మం పట్టాలా, లోతు తెలియని కూపంలో ఈత రాక పడినట్టు? చిన్నతనాన కట్టుకున్న భార్యను అచింత్యంగా ప్రేమించాను, చేదబావిలోంచి నీరు తోడుకొని స్నానం చేసినట్టు. కాని నీ వయోవిలాస మకరంద స్రవంతిని చూడగానే మురిసి గభాలున దూకడంలో యింత గందరగోళం ముంచుకవచ్చింది. యౌవనంలో సహజంగా, వెల్లువవలె ప్రతి వ్యక్తికీ యెవరో ఒకరిపై ప్రేమ పొంగిపోతుందని ఒప్పుకుంటే, ఆ వెల్లువ నిన్ను చూసిన తర్వాతనే నాలో ఈ ముసలితనంలోనే ఉద్భవించాలా నా దుష్కర్మ కాకపోతే? కాని లాభమేమి? నన్ను యెప్పటికీ నీవాడిగా చేసుకోకపోతివి. అంతేకాదు. బిచ్చపువాడికి దానంచేయకున్నా, వాడు చేసే హరినామస్మరణగూడా చెవుల్లో పడకుండా త్వరగా గెంటివేసే కొందరు గృహస్థులవలె, యిప్పుడు నాకు నిన్ను చూసే అవకాశం కూడా లేకుండాపోయింది.

“ఎక్కడో నీవు సుఖంగా వున్నావని తెలిసింది. అంతే చాలు. నాకూ బుద్ధి వచ్చింది. అసహాయ స్థితిలో అనాథవై శరణార్థివై వచ్చిన నిన్ను నా కూతురువలె కాపాడక దుర్మతినై ఈ వార్ధక్యంలో కేవలం నీ అసహాయ స్థితి చూసి నిన్ను నా దానిగా చేసుకోవాలనుకున్నాను. అయితే నా ప్రేమలో కామపుఛాయలుండినా, అసలు దానితోనే నీమీద మమకారం ప్రారంభమయినా, నిజంగా నిన్ను అంత ప్రగాఢంగా ప్రేమించాను కాబట్టే యిప్పుడీ ఉత్తరంలో యివన్నీ వ్యక్తంచేసి యింత దూరం వ్రాసుకొచ్చి నా గుండె బరువు తీర్చుకుంటున్నాను.

“మతకలహాల మారణహోమంలో ‘నా’ అన్నవాళ్ళంతా అదృశ్యులైపోగా, కనీసం మానం కాపాడుకోడానికి, దుండగీడులు వెన్నాడుతూవుంటే, నా పెద్ద బంగాళానూ, ఇంటిముందరి బోర్డునూ చూసి, నేనేమో మహా రక్షిస్తానని అనుకొని నాయింట్లోకి ‘శరణాగతి’ అని ప్రవేశించిన నిన్ను ఆ దుష్టుల బారినుండి తప్పించాను కాని తరువాత నిన్ను యెవరికీ కనపడనీయకుండా పంజరంలో చిలకను బంధించినట్టు బంధించాను. నిన్ను రోజు రోజుకూ చూస్తూవుంటే, యెన్నడూ యే కార్యమూ చేయని నాకు, అదేమిటో మనసు మారిపోయింది. నాలోని పశువు తలెత్తిందనుకోక, నాలో నిజమైన ప్రేమ నీమీద కలిగిందనుకుని, నన్ను నేను మోసగించుకొని నిన్ను కూడా వంచించాను. కాని నీవు మాత్రం నాలోని పశువునే చూసి కపటోపాయంతో తప్ప నన్ను యింకోవిధంగా తప్పించుకోజాలనని తెలుసుకున్నావేమో. కిక్కురుమనకండా అతిత్వరగా నాకు లొంగిపోయినట్లు నటించావు. అంతేకాక నేనెంత ప్రేమించానో అంత ప్రేమే నీకూ నామీదవున్నట్టు చూపించావు. శాశ్వతంగా చెరనుంచి విముక్తురాలవు కావాలనుకొని నీవు యెంతకైనా సిద్ధపడ్డావు. ఎన్ని త్యాగాలో చేశావు. చివరకి నీ శీలాన్ని కూడా బలియిచ్చావు! ఎందుకంటే అంతత్యాగం చేసింతర్వాతే కాని నేను ప్రమత్తుణ్ణయి యిహ నీవు యెక్కడికీ వెళ్ళవని అజాగ్రతగా వుండ ప్రారంభించాను. నీ యీ ఉపాయం నా ఆత్మవంచనానికిమాత్రం బలం కూరుస్తూనే వచ్చింది. ఒకవేళ నీవు నన్ను యెదిరించివుంటే కేవలం విసుగూ నిరాశ, దాని తర్వాత మాత్సర్యం వల్లా నిన్ను యే మొరటుగుండాలకో అప్పగించేవాణ్ణని తెలుసు నీకు. అబ్బ యెంత చాకచక్యంతో ఈ యమదంష్ట్రికలనుండి తప్పించుకున్నావు! ఇప్పుడనుకుంటున్నాను, నీవు తప్పించుకొని పోకపోయివుంటే బహుశః నిరాశతో ప్రభుత్వానికి అప్పగించి అట్లాకూడా ప్రశంసాపాత్రుడనయ్యే ప్రయత్నం చేసేవాడినేమో! నన్ను క్షమించు... నా కలం యెట్లా నడిస్తే

ఎట్లా వ్రాస్తున్నాను. నేను చచ్చేముందు, బ్రతికి ఉండగా నిన్ను క్షమించమని కోరకపోతినే అనే దిగులు వుండదని వ్రాసుకుంటున్నాను.

ఏ ధోరణిలో ఉత్తరం ప్రారంభించానో, యే ధోరణిలో ముగిస్తున్నానో నీకు తెలిసిపోతూనేవుంది. అదే విధంగా నీకుపెళ్లి అయిపోయిందని తెలుసుకున్న నాటినుంచీ నామనసు పూర్తిగా మారిపోయింది.

"ఈ ఉత్తరం నీ భర్త చేతిలో పడాలనీ, నీ కాపురం బుగ్గి కావాలనీ అప్పుడు నా కసి తీరాలనీ వ్రాయడంలేదు. ఉత్తరం చూసినా పెద్ద రాద్ధాంతం చేసి నిన్ను అధోగతిపాలుజేసేటంత అయోగ్యుడూ అవివేకీ అనుకోను నీభర్త. అట్లాంటివాడే అయితే యిన్ని యిడుములబడి యింతకాలం తరువాత నిన్ను అమాంతంగా పెండ్లి చేసేసుకునేవాడే కాదు. ఎంతో విశాల హృదయుడూ, ఉదాత్తమైన సంస్కారం కలవాడే అయివుండాలి ఆ మహానుభావుడు. ఇది కేవలం నా యొక్క ప్రేమను, నా ప్రవర్తన ఎంత నీచంగా వుండినా తెలుపడానికే నా హృదయం తేలిక కావడానికే వ్రాశాను. ఈ ఉత్తరం చదువుకుని అసలు చదువుతావో లేదో పూర్తిగా నన్ను క్షమించి, నాకు ఒకనిట్టూర్పు భిక్ష పెట్టితే చాలు, నా జీవితశేషం ఓ మాదిరిగా గడిచిపోతుంది. ఇహ మళ్లీ నీకు ఉత్తరం వ్రాయను. నీవు - మీరు - జవాబు వ్రాస్తారని గూడా ఆశ పెట్టుకోలేదు. సెలవు .."

* * *

"నిజంగా యెంత పిచ్చివాడు"అంది భారతి ఒక చిన్న నిట్టూర్పుతో, ఉత్తరాన్ని రెండుగా చీలుస్తూ.

"చింపకు. చింపకు. ఉండనీ పాపం! ఒక్క అశ్రుతర్పణమైనా చేస్తావేమో అని, కొండంత ఆశతో అతడు నమ్మి వ్రాస్తే నీవు 'పిచ్చివా'డంటావా?" అన్నాడు రఘు పైపు వెలిగించి అర్థయుక్తంగా భారతివైపు చూస్తూ.

"పిచ్చికాక యింకేమిటి? తన వయస్సెక్కడ నేనెక్కడ? తానెవరూ నేనెవరూ? నేను చేసిందంతా నటన అని యిప్పుడు తెలిసికొన్నాడట. అయినా మనిషి చాలా రసికుడల్లే వున్నాడు సుమండీ!"అంది భారతి రఘువైపు నిశితంగా చూస్తూ.

"అవును. పాపం ఆ సంగతి మొదటే నీకు తెలిస్తే నా దాకా వచ్చేదానివి కావేమో!" అన్నాడు రఘు యెక్కడలేని గాంభీర్యాన్ని నటిస్తూ.

"సరే మళ్లీ అక్కడికే వెడతాలెండి" అంటూ ఉత్తరాన్ని ప్రక్కనేవున్న కుంపటిలోకి వేసింది భారతి.

"చాల తప్పు" అన్నాడు రఘు.

"ఇక్కడ ఇది కాలేవరకు అక్కడ అతడు గూడా..." అంది భారతి కాలిన ఉత్తరంలో నుంచి, చితిలోని అస్థిపంజరంవలె కనబడుతున్న అక్షరాలను ఓమాదిరిగా చూస్తూ.

"ఛీ అలా అనకు నిజంగా మీ ఆడవాళ్లకు కనికరం అనేది వుండదు ఒక్కోసారి, యెంత చదువుకున్నా" అన్నాడు రఘు తనమాటలను తానే నమ్మనట్టుగా.

"అవును! చూస్తున్నానుగా మీ మగవాళ్లకు యెంత కనికరం వున్నదో. మొన్న మన దేశానికి తిరిగివచ్చిన అపహృత స్త్రీల సమూహంలోనుంచి ఎంత మందిని పరిగ్రహించారో! పెద్దపెద్ద వాళ్లంతా చివరికి శ్రీ శంకరాచార్యులవారు కూడా మీకు బుద్ధి చెప్పవలసి వచ్చింది అందుకే" అంది భారతి తడుముకోకుండా.

"ఆయన ముసలివాడు గాబట్టి సరిపోయింది. లేకపోతే నాలాటివాడే నిన్ను వేసుకపోయి వుంటే యీపాటికి" అని రఘువాక్యం ముగింపక ముందే,

"ఈ ప్రసంగం చాలించి డ్రెస్ చేసుకోండి క్లబ్బుకు వేళయిపోయింది" అని తొందర పెట్టింది భారతి.

"ఇంత వర్షంలో, ఈ చలిలో ఎవరొస్తారు క్లబ్బుకు?" అన్నాడు రఘు ఆరిపోయిన పైపును మళ్ళీ వెలిగిస్తూ.

"అయితే యిప్పుడేమిటి చేయడం?" అని అడిగిందిభారతియింకేమీచేయడానికిపనిలేనట్టు.

"ముచ్చటగా మీ ముసలివాడికి ఉత్తరం వ్రాయి" అన్నాడు రఘు వంకరగా భారతి

కళ్లలోకి చూస్తూ.

"ఏ ముసలివాడు?" అంది భారతి అప్పుడే ఉత్తరం సంగతి పూర్తిగా మరచిపోయినట్టు.

"ఇతడు" అని అగ్నిలో యింకా తన స్వరూపాన్ని పూర్తిగా పోగొట్టుకోని ఉత్తరం వైపు చూపించాడు రఘు.

"నా ముసలివాడు మీరే-మీ ముసలిదాన్ని నేనే-లేవండి" అని రఘు భుజం పట్టుకొని వూపింది భారతి.

"నా ముసలిది ఆమె" అని టేబిలుపైన ఫ్రేములోవున్న భారతి ఫోటోవైపు చూపించాడు రఘు.

---

వర్ధమాన జాతీయ సంస్థ

# చీకటి బజారుకి జేజేలు

**నీ నా**

"ఓ సుందరీ!"

"ఏమండీ?"

"పలుకరాదటే చిలుకా. పలుకరాదటే—ఓ, చిలుకా పలుకరాదటే?"

"ఒక్కమాటు పెద్ద గాయకశిఖామణులై పోయినట్లుందే? ఏమిటి సెలవు?"

"'లలనా నిమోము చూడనే పుట్టు కవిత్వము, కపిత్వము, పైత్యము పరవశత్వమునన్' అన్నాడు మహాకవి."

"సరేలెండి ఠరిగ్గా కూచున్నారు కాని నాకు తీరికలేదు మీ పైత్యాలన్నీ వినడానికి. ఎందుకు పిలిచారో చెప్పండి."

"ఇవాళ ఉగాది పండుగ ఏంచేస్తావ్?"

"శనివారం చేయదల్చుకున్నాను."

"భేష్!...నీవు కూడా శ్లేష ప్రయోగిస్తున్నావే?"

"కవిగారి భార్యామణికి ఆమాత్రమైనా కవిత్వం రాకపోతే ఎలా చెప్పండి."

"సరే నీవుద్దేశం చెప్పావు కావు?"

"చెప్పానుగా శనివారమని! అదికాకపోతే ఏకాదశి."

"అరెరె. ఖరనామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమీ దినాన్ని పట్టుకుని ఏకాదశి అంటావేం?"

"మరేం చేయమన్నారు?"

"ఏం ఇంటో ఏమీ లేదా?"

"ఏముంది ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. నాకు పండగపూట పొయిమీదికి గిన్నె కెక్కించే అవస్థ తప్పింది. హాయిగా నేనూ కుర్చీలో కూర్చొని పాటలు, పద్యాలు రాయొచ్చు."

"ఏం సంవత్సరాదినాడు మొగుణ్ణి సాధిస్తే సంవత్సరం పొడుగునా సాధించవచ్చుననా నీ వుద్దేశం. పండగపూటా శనివారాలు, ఏకాదశులు వుండమంటే ఎలా?"

"ప్రజారాజ్యంలో ఖరశీర్షముల పరిపాలనలో సంవత్సరానికి ఆదేమిటి, అంతమేమిటి, ఏకాదశేమిటి,శనివారమేమిటి అంతా ఒకటే."

"చచ్చామన్నమాటే? ఏది దారి?"

"మీయిష్టం. ఇంట్లో బియ్యంలేవు. మీకేది తోస్తే అది చెయ్యొచ్చు. నిన్నటికే బొటాబొటీగా వచ్చాయి వారమల్లా సర్దితే. ఇవాళ పస్తే."

"పండుగనాడూనా అని"

"మనకి పండగేమిటి, మంత్రులకు, లెజిస్లేచర్ మెంబర్లకు, పర్మిట్ల మోతుబర్లకు కాని! మనకు ప్రతివారం పండుగే, ప్రతి శనివారం ఏకాదశే!"

"ఆదివారం పండగెలా అయింది?"

"మీరు పొద్దున ఏడుగంటలకు రేషన్ షాపుకుపోయి పదకొండు గంటలకు బియ్యం తీసుకువస్తే వండి రెండుగంటలకల్లా పెడతాను కదా! మరి పండగనాడూకూడా భోజనాలు ఆలస్యం కావూ? అంచేత భోజనం ఆలస్యం ఐన రోజునే మనకి పండగ."

"నిన్నో పార్లమెంటు మెంబరుగా చేస్తే యిలాగే ఏకి పారేసావు కాబోలు మంత్రు